

# ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

**24 గంటల ముందే తీసుకోవాలి**

- అరకు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్‌కోర్ సెల్ ఏర్పాటు
- అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌వో, ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న అభిషేక్

**అరకులోయ, మార్చి 26:** పోటీలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి 24 గంటల ముందు అనుమతులు పొందాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీల అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా ప్రచారం, ర్యాలీ, ప్రత్యేక స్టార్ క్యాంపెయిన్, మైక్ పర్మిషన్, బహిరంగ సభలు.. ఇలా ప్రతి కార్యక్రమానికి సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. దీని కోసం ఆరు శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉందని, అయితే ఆ శాఖలకు తిరగాల్సిన పని లేకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ అనుమతులు పొందేందుకు వీలుగా అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఎన్‌కోర్(ఎనెబ్లింగ్ కమ్యూనికేషన్స్ ఆన్ రియల్-టైమ్ ఎన్విరాన్‌మెంట్) సెల్‌ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఐదు రోజులపాటు ప్రచారానికి సంబంధించి ఒకేసారి అనుమతులు పొందేందుకు ఈ సెల్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే ఈ అనుమతులు 24 గంటల ముందు పొందాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో 304 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎం మెషీన్లను భద్రపరుస్తామన్నారు.



వివిధ పార్టీల అభ్యర్థులతో మాట్లాడుతున్న అభిషేక్

### పాడేరు ఐటీడీఏ ఆఫీస్‌లో నామినేషన్ల స్వీకరణ

అరకు అసంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు పాడేరు ఐటీడీఏ ఆఫీస్‌లోని పీవో చాంబర్‌లో నామినేషన్లు అందజేయాల్సి ఉంటుందని అభిషేక్ చెప్పారు. అరకులోయ తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూమ్ ఉన్న కార్యాలయంలోనే నామినేషన్లు స్వీకరించకూడదన్నారు. ఎన్నికల అనంతరం ఈవీఎంల భద్రత, ఓట్ల లెక్కింపు అంతా పాడేరు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ధీరజ్, డీఎల్‌పీవో కుమార్, పలు శాఖల అధికారులు, టీడీపీ నుంచి సియ్యారి దొన్నుదొర, దాసుబాబు, అమ్మన్న, శెట్టి బాబూరావు, వైసీపీ నుంచి రేగం మత్స్యలింగం, కిరణ్, దిలీప్‌కుమార్, రాంబాబు, సీపీఎం నుంచి దీసరి గంగరాజు, ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ నుంచి శాంతకుమారి, డేవిడ్, ఆమ్ ఆద్మీపార్టీ నుంచి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

**నెలాఖరుకు సమస్యలు పరిష్కరించాలి**

- అధికారులకు కలెక్టర్ విజయసునీత ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

**పాడేరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి):** వేసవి నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, గుర్తించిన తాగునీటి సమస్యలను ఈ నెలాఖరుకు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎం.విజయసునీత ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలో తాగునీటి సమస్యలపై గ్రామీణా నీటి సరఫరా విభాగం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు పడకూడదన్నారు. ప్రధానంగా జాతీయ రహదారి పనులు చేపడుతున్న క్రమంలో పాడైన పైపు లైన్లను, జిల్లా కేంద్రం పాడేరులో సుమారుగా కిలో మీటరు మేర పాడైన పైపులైన్లను తక్షణమే బాగు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 228 బోర్లు పని చేయడం లేదని, వాటిని ఈ నెలాఖరు నాటికి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మోటార్లు పాడై నిరుపయోగంగా ఉన్న నీటి పథకాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆయా ప్రాంతాల్లో తాగునీటిని అందించాలన్నారు. సోలార్ నీటి పథకాలకు నిర్వహణ సక్రమంగా చేపట్టి వినియోగం కొనసాగించాలని జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారులకు సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అవసరమైన చర్యలను చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

### కొండ శిఖర గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లాలో కొండ శిఖర గ్రామాల్లో తాగునీటి సదుపాయాలు, సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలో రాచకిండాం గ్రామంలోని తాగునీటి పథకానికి విద్యుత్ సదుపాయం కల్పించకపోవడంతో నీటి సరఫరా జరగడం లేదని గుర్తు చేశారు. అలాగే జిల్లాలో వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, మండలాల్లో బోర్ మెకానిక్‌లు లేకపోవడం వల్ల ఆయా మండలాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అక్కడ బోర్ మెకానిక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు తాగునీటిని అందించే విషయంలో అన్ని శాఖలకు చెందిన ... మిగతా 8వ పేజీలో

# భద్రత కత్తిమీద సామే!

## జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 248 పోలింగ్ కేంద్రాలు

- అత్యధికంగా ముంచంగిపుట్టు మండలంలో 50..
- తరువాత స్థానం చింతూరు మండలంలో 28..
- జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 1,021
- సమస్యాత్మకమైనవి 281
- అత్యంత సమస్యాత్మకమైనవి 211
- జిల్లాకు ఒడిశా, ఛతీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు సరిహద్దు కావడమే కారణం
- ఎన్నికల్లో ప్రత్యేక భద్రతా చర్యలకు యంత్రాంగం కసరత్తు



మావోయిస్టు ప్రభావిత చింతపల్లి మండలం చెరువూరు పోలింగ్ కేంద్రం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలున్న జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లాను కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఎక్కడైనా 10 నుంచి 20 శాతం సమస్యాత్మకమైనవి లేదా మావోయిస్టుల ప్రభావితమైనవి ఉంటాయి. కానీ జిల్లాలో అందుకు భిన్నంగా మొత్తం పోలింగ్ కేంద్రాల్లో కేవలం 25 శాతం కేంద్రాలు సాధారణంగా ఉండగా... 25 మావోయిస్టుల ప్రభావితమైనవి, 25 శాతం సమస్యాత్మకం, 25 శాతం అత్యంత సమస్యాత్మకమైనవిగా పోలీస్ అధికారులు గుర్తించారు. దీంతో ఇతర జిల్లాల కంటే ఈ జిల్లాలో ఎన్నికల నిర్వహణలో పోలీసుల భద్రతా చర్యలు అత్యంత కీలకంగా మారాయి.

**జిల్లాలో పోలింగ్ కేంద్రాల స్థితిగతులివి**

| నియోజకవర్గం | మొత్తం | సమస్యాత్మం | అత్యంత సమస్యాత్మకం | మావోల ప్రభావితం |
|---|---|---|---|---|
| అరకులోయ | 304 | 60 | 60 | 93 |
| పాడేరు | 318 | 119 | 81 | 58 |
| రంపచోడవరం | 399 | 102 | 70 | 97 |
| మొత్తం | 1,021 | 281 | 211 | 248 |

### జిల్లాలో మూడు రకాల భద్రతా చర్యలు

జిల్లాలోని మావోయిస్టుల ప్రభావితం, సమస్యాత్మకం, అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలుండడంతో పోలీసులు ఆయా ప్రాంతాలకు అనుగుణంగా మూడు రకాల భద్రతా చర్యలు చేపడతారు. మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో గాలింపులతో పాటు, పోలింగ్ కేంద్రానికి చుట్టుపక్కల సైతం భద్రతా బలగాలను మోహరిస్తారు. అలాగే సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మకమైన కేంద్రాల వద్ద పోలీసుల గస్తీని ఏర్పాటు చేసి, అవసరాన్ని బట్టి అక్కడికి అత్యవసరంగా అదనపు బలగాలను తరలించేందుకు సిద్ధం చేస్తారు. దీంతో పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాల స్థితిగతులకు అనుగుణంగా భద్రతా చర్యలను చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకుని కార్యాచరణలోకి దిగుతారు. దీంతో ఎన్నికల కమిషన్ సైతం భద్రతపరంగా అల్లూరి జిల్లాకు ప్రాధాన్యం ఇస్తుంది.

### మూడు రాష్ట్రాల సరిహద్దు కావడమే కారణం

అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకుని ఒడిశా, ఛతీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు ఉండడం వల్లే అధిక సంఖ్యలో మావోయిస్టుల ప్రభావితమైనవి, అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలుండడానికి ప్రధాన కారణం. జిల్లాలో అరకులోయ, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, వై.రామవరం మండలాలు ఒడిశాకు సరిహద్దున ఉన్నాయి. అలాగే చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్.పురం మండలాలు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు చేరువగా వున్నాయి. ఆయా రాష్ట్రాలకు సరిహద్దున వున్న ప్రాంతాలన్నీ అడవుల్లో ఉండడంతోపాటు మావోయిస్టు ప్రభావితమైనవి కావడంతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలకు భద్రత కల్పించడం సైతం యంత్రాంగానికి కత్తిమీద సాములా ఉంటుంది. దీంతో ఈ జిల్లాలో ఎన్నికల నిర్వహణపై ఎన్నికల కమిషన్, యంత్రాంగం సైతం ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. ప్రధానంగా భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక చర్యలు చేపడుతుంటారు.



అత్యంత సమస్యాత్మకమైన జీకేవీధి మండలం కుంకంపూడి పోలింగ్ కేంద్రం

# అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి 'బూడి'

- ఉప ముఖ్యమంత్రిని సమన్వయకర్తగా నియమించిన వైసీపీ అధిష్ఠానం
- మాడుగుల ఇన్‌చార్జిగా ముత్యాలనాయుడు కుమార్తె అనురాధ



**అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):** అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్త పేరును వైసీపీ అధిష్ఠానం ఎట్టకేలకు మంగళవారం ... మిగతా 8వ పేజీలో

**రంజాన్ వేళలు**

| | |
|---|---|
| ఇఫ్తార్ (బుధ) | 6.13 |
| సహరి (గురు) | 4.42 |



# వేరుశనగ సాగు విస్తరణ ప్రణాళిక

**కె-7 బోల్డ్ రకం విత్తనం రైతులకు పంపిణీకి శాస్త్రవేత్తల చర్యలు**

- ఎకరాకి 16 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి
- పరిశోధన స్థానంలో కదిరి లేపాక్షిపై పరిశోధనలు



ఆర్ఏఆర్ఎస్‌లో ప్రయోగాత్మక సాగుచేపడుతున్న కదిరి లేపాక్షి వేరుశనగ (ఫైల్)

**చింతపల్లి, మార్చి 26:**

**ఉన్నత పర్వతశ్రేణి గిరిజన మండలాల్లో వేరుశనగ సాగు విస్తరణకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ కలిగిన కె-7 బోల్డ్ విత్తనాలను రైతులకు మినీ కిట్ల రూపంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే రానున్న రోజుల్లో అత్యధిక దిగుబడినిచ్చే నూతన వంగడాన్ని కూడా అందజేయాలని పరిశోధన స్థానంలో కదిరి లేపాక్షి రకంపై పరిశోధనలు చేస్తున్నారు.**




కె-7 బోల్డ్ విత్తనం



బోల్డ్ కాయలు (ఫైల్)

అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల గిరిజన మండలాల్లో 20 ఏళ్లగా అతి తక్కువ విస్తీర్ణంలో గిరిజన రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో దేశవాళి రకాల వేరుశనగను సాగుచేస్తున్నారు. పాడేరు డివిజన్ పరిధిలో 1,980 వేల హెక్టార్లు మాత్రమే వేరుశనగ సాగు చేస్తున్నారు. రైతులు సాగుచేస్తున్న వేరుశనగ ఎకరాకు కేవలం 5 క్వింటాళ్ల దిగుబడిని మాత్రమే ఇస్తుంది. దీంతో ఈ పంటను వాణిజ్యసరళిలో సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. గిరిజన ప్రాంతాల వాతావరణం, నేలలు వేరుశనగ సాగుకు అత్యంత అనుకూలమని పరిశోధన ద్వారా గుర్తించారు. దీంతో గిరిజన రైతులతో వేరుశనగను వాణిజ్య సరళిలో సాగుచేసేలా ప్రోత్సహించేందుకు నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే వంగడాలను అందజేయాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. గత ఏడాది చింతపల్లిలో గిరిజనుల వ్యవసాయంపై శాస్త్రవేత్తలు నిర్వహించిన జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు, నిపుణులు అత్యధిక దిగుబడి, గింజ పెద్ద పరిమాణంలోనున్న కె-7బోల్డ్ రకం విత్తనం రైతులకు అందజేయడంతోపాటు సాగు విస్తీర్ణం పెంపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. కే-7బోల్డు రకం నూతన వంగడాలపై పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో ఈ రకం విత్తనం ఈ ఏడాది ఖరీఫ్ నాటికి మినీ కిట్ల రూపంలో పంపిణీచేసి ... మిగతా 8వ పేజీలో

### వేరుశనగ సాగు విస్తరణకు చర్యలు




గిరిజన రైతులకు నాణ్యమైన విత్తనం అందించి వేరుశనగ సాగును విస్తరించాలని ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించాం. వేరుశనగలో కే-7 బోల్డ్ విత్తనం మినీ కిట్ల రూపంలో పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేశాం. అలాగే పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగుచేపట్టిన కదిరి లేపాక్షి రకం ఉత్తమ ఫలితాలు వచ్చాయి. వచ్చే ఏడాది ఈ నూతన రకం విత్తనాలను రైతులకు అందజేస్తాం. సాగు విధానం, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నాం.

**- డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్,** ఏడీఆర్, చింతపల్లి

# నేటి నుంచి సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

- పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ఉదయం పది గంటల నుంచి ప్రారంభం



**విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 26:** విశాఖ క్రికెట్ క్రీడాభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు బుధవారం ఉదయం పది గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ప్రారంభం కానున్నాయి. ఈ మ్యాచ్ 31వ తేదీన స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్నది. టికెట్ల ధరలు రూ.1,000, రూ.1,500, రూ.2,000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించారు. విశాఖలో జరిగే ఇంటర్నేషనల్ వన్డే, టీ-20 మ్యాచ్‌లకు ఆన్‌లైన్‌లో కాకుంటే ఆఫ్‌లైన్ ద్వారానైనా టికెట్ పొందేందుకు అవకాశం ఉండేది. కానీ, ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకాలు కేవలం ఆన్‌లైన్‌కు మాత్రమే పరిమితం చేశారు. ఈనెల 31వ తేదీన జరిగే మ్యాచ్‌లో ధోనీ ఆడనుండడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ధోనీ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పడం, రానున్న ఐపీఎల్ సీజన్‌లో ఆడే అవకాశాలు తక్కువగా ఉండడం, దాదాపు ఐదేళ్ల తర్వాత విశాఖలో ఆడనుండడం, పైగా చెన్నై సూపర్‌కింగ్స్ ఐపీఎల్‌లో బలమైన జట్టు కావడం వంటి అనేక కారణాలు మ్యాచ్‌పై క్రేజ్‌ను పెంచాయి. అయితే ... మిగతా 8వ పేజీలో

# మొరాయించిన ఆర్టీసీ బస్సులు

- మరమ్మతులకు గురై ధారకొండ ఘాట్‌లో నిలిచిన రెండు బస్సులు
- ప్రయాణికుల అవస్థలు




ధారకొండ ఘాట్‌లో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

**సీలేరు, మార్చి 26:** నర్సీపట్నం నుంచి సీలేరు, గుమ్మిరేవుల ప్రాంతాలకు వెళ్లే రెండు ఆర్టీసీ బస్సులు మంగళవారం ఉదయం ధారకొండ ఘాట్‌లో మరమ్మతులకు గురై నిలిచిపోయాయి. దీంతో విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు, ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపోనకు చెందిన గుమ్మిరేవుల బస్సు ప్రతి రోజు ఉదయం నాలుగున్నర గంటలకు, సీలేరు సర్వీసు బస్సు ఉదయం 5:45 గంటలకు బయలుదేరతాయి. రోజూ నర్సీపట్నం, చింతపల్లి, జీకేవీధి ప్రాంతాల నుంచి సీలేరు, ధారకొండ, సప్పర్ల తదితర ప్రాంతాల్లో పనిచేసే వివిధ శాఖల ఉద్యోగులు, ఈ ప్రాంతవాసులు ఈ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. మంగళవారం ఉదయం ఈ రెండు బస్సులు ధారకొండ ఘాట్ వద్ద వేర్వేరు ప్రాంతాల్లో ఆగిపోవడంతో నాలుగు గంటలు ఆలస్యంగా ప్రయాణికులు ప్రత్యామ్నాయ వాహనాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఘాట్ వద్ద అల్పాహారం, మంచినీళ్లు దొరకక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు గిరిజన ప్రాంతాలకు కండీషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులను పంపించాలని ఈ ప్రాంతవాసులు, ఉద్యోగులు కోరారు.

# కిరాణా షాపు యజమానికి సైబర్ నేరగాళ్లు టోకరా

- రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.3 లక్షలు తస్కరణ
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



**పాయకరావుపేట, మార్చి 26 :** పట్టణంలోని ఓ కిరాణా షాపు యజమాని బ్యాంకు ఖాతాల నుంచి రూ.1.3 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు తస్కరించారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు. పాయకరావుపేటలో డీసీసీబీ బ్యాంకు పక్కన ఉన్న కిరాణా షాపు వద్దకు గుర్తు తెలియని వ్యక్తి ఒకరు వచ్చి సుమారు రూ.6 వేల విలువైన సరకులు కొనుగోలు చేశాడు. డబ్బులను ఫోన్ పే ద్వారా చెల్లిస్తానని చెప్పడంతో యజమాని రెడ్డి అప్పారావు సరే అన్నాడు. ఇంతలోనే ఆ వ్యక్తి.. తన సెల్ ఫోన్‌లో ఫోన్ పే కావడంలేదని, తన స్నేహితుడి సెల్ నంబర్‌కు ఒక రూపాయి ఫోన్ పే ద్వారా చెల్లిస్తే అతను రూ.6 వేలు పేమెంట్ చేస్తాడని చెప్పాడు. దీంతో షాపు యజమాని తన సెల్ నుంచి రూపాయి ఫోన్ పే చేశాడు. అది ఫెయిల్ రావడంతో షాపు యజమాని తన రెండో నంబరుతో మరో రూపాయి ఫోన్ పే చేశాడు. అయితే అది కూడా ఫెయిల్ రావడంతో.. కిరాణా సరకులు ఇక్కడే వుంచడి, చికెన్ సెంటర్‌కు వెళ్లి డబ్బులు తీసుకువచ్చి సరకులు తీసుకెళతానని చెప్పి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికి షాపు యజమాని అప్పారావు సెల్‌కి రెండు మెసేజ్‌లు వచ్చాయి. ఒక ఖాతా నుంచి రూ.99,000, మరో ఖాతా నుంచి రూ.30,900 డెబిట్ అయినట్టు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

## రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి





మృతిచెందిన వ్యక్తి (ఇన్‌సెట్‌లో) మృతుడి చేతిపై ఉన్న ఇంగ్లిష్ అక్షరాలు

**అనకాపల్లి టౌన్, మార్చి 26:** రైల్వేస్టేషన్ సమీపంలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి రైలు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శాంతారామ్ వెల్లడించిన సమాచారం మేరకు.. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రైల్వే లైన్ పక్కన విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద ఒక వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉన్నట్టు సోమవారం రాత్రి ప్రభుత్వ రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తికి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి పది గంటల తర్వాత మృతిచెందాడు. ఇతని వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వుం టుందని, చేతి మీద 'బీఎస్ఎం' అని ఇంగ్లిష్‌లో పొడి అక్షరాలు ఉన్నాయి. ఇంతకు మించి మరే ఆధారాలు అతని వద్ద లభ్యం కాలేదు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ.. మహిళ మృతి

**కశింకోట, మార్చి 26:** మండలంలోని జి.భీమవరం సమీపంలో వంతెన వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్ బాబు తెలిపిన వివరాలిలా వున్నాయి. రావికమతం మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన శంకు మహాలక్ష్మమ్మ (65), తన అల్లుడు సురవరపు రాముతో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం మధ్యాహ్నం రాంబిల్లి మండలం వెంకటాపురంలో బంధువుల ఇంటికి వెళ్లారు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా దారిలోఓ జి.భీమవరం సమీపంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొన్నది. దీంతో మహాలక్ష్మమ్మ తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతిచెందింది. ఆమె అల్లుడు సరవరపు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**ఎలమంచిలి, మార్చి 26:** ప్లబింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ కింద పడిపోయి తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు అందించిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి మునిసిపాలిటీ రామ్‌నగర్‌కు చెందిన శీరందాసు ప్రేమ్ కుమార్(25) ఈ నెల 13వ తేదీన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల భవనం మరుగుదొడ్డిలో ప్లంబింగ్ పనులు చేస్తూ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఎలమంచిలిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు చెప్పారు.

## రైలు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థికి గాయాలు

**ఎలమంచిలి, మార్చి 26:** ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో పాలిటెక్నిక్ విద్యార్థి ఒకరు గాయపడ్డాడు. సంఘటన గురించి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్ప డంతో, అతని స్నేహితుడు వచ్చి, క్షతగాత్రుడిని ఎలమం చిలి సీహెచ్‌సీకి తరలించాడు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి చెందిన ఎం.చంద్రమౌళి అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం సొంతూరు నుంచి రైలులో వస్తుండగా ఎలమంచిలి వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న చంద్రమౌళి స్నేహితుడికి ఫోన్ చేసి, ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరారు. దీంతో స్నేహితుడు ఎలమంచిలి వచ్చి చంద్రమౌళిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. తలకు తీవ్రగాయం కావడంతో వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా ప్రమాదం ఎలా జరిగిందో చెప్పలేకపోతున్నాడని వైద్య సిబ్బంది తెలిపారు.

## మూడు గ్రావెల్ లారీల పట్టివేత

**పరవాడ, మార్చి 26:** గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పట్టుకున్నామని గనుల శాఖ రాయల్టీ విభాగం ఆర్‌ఐ స్వాతి తెలిపారు. పెదముషిడివాడ రెవెన్యూ పరిధి నుంచి ఎటు వంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్‌ఐ స్వాతి సోమవారం అర్థరాత్రి సిబ్బందితో కలిసి లంకెలపాలెంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా మూడు లారీలను పట్టుకున్నారు. గ్రావెల్ తవ్వకాలు, రవాణాకు సంబంధించి వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో లారీలను పరవాడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎంతమేరకు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారో కొలతలు తీసిన అనంతరం అపరాధ రుసుము విధిస్తామని, అప్పటి వరకు వాహనాలు పోలీసుల అదుపులోనే ఉంటాయని స్వాతి తెలిపారు.

## 15 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరి అరెస్టు

**పరవాడ, మార్చి 26:** ఇద్దరు వ్యక్తుల నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. పరవాడకు చెందిన దొడ్డి యశోదకృష్ణ, తానాం గ్రామానికి చెందిన అల్లు లక్ష్మణరావు ప్రభుత్వ దుకాణం నుంచి మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. దారిలో తనిఖీలు నిర్వహించిన సీఐ బాలసూర్యారావు.. వీరిద్దరి నుంచి మద్యం సీసాలను పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

## సారా, మద్యం కేసుల్లో ఇద్దరి అరెస్టు

» పది లీటర్లు సారా, 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

**కృష్ణాదేవిపేట, మార్చి 26:** సారా, మద్యం కేసుల్లో ఇద్దరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి పోలీ సులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన చిక్కాల అప్పలరాజు 10 మద్యం బాటిళ్లను బెల్ట్‌షాపునకు మంగళవారం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు గొలుగొండ ఎస్‌ఈబీ ఎస్‌ఐ షేక్ రెహమాన్ తెలిపారు. అలాగే కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన పప్పుల జ్యోతి పది లీటర్ల సారాను విక్రయించేందుకు తీసుకువెళుతుండగా కొంగసింగి రహదారిలో గల రత్నంపేట జంక్షన్‌లో పట్టుకుని ఆమెపై కేసులు నమోదు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

## 27 మద్యం సీసాలు స్వాధీనం

**అనకాపల్లి టౌన్, మార్చి 26:** మద్యం తరలిస్తున్న ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసి 27 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీసు స్టేషన్ హెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. జమాదులపాలెం గ్రామానికి చెందిన చందనాల రాజు 14 మద్యం బాటిళ్లు తీసుకువెళ్తూ గూడ్స్‌షెడ్ వద్ద పట్టుబడ్డాడని, అలాగే నూకాంబిక ఆలయ ప్రాంతంలో నివాసముంటున్న నాగేంద్ర వెంకటరామయ్య అనే వ్యక్తి 13 మద్యం బాటిళ్లతో చింతావారివీధిలో దొరికాడని తెలిపారు.

## వాడచీపురుపల్లిలో 10 మద్యం సీసాలు పట్టివేత

**పరవాడ, మార్చి 26 :** మండలంలోని వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన జె.గౌరీశంకరరావు మంగళవారం రాత్రి స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి పది క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకు వెళుతుండగా పట్టుకున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 107.00 |
| లైవ్ ధర | 127.00 |
| విత్ స్కిన్ | 224.00 |
| స్కిన్ లెస్ | 234.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 415 |
| విజయనగరం | 419 |
| శ్రీకాకుళం | 419 |

# 7 నుంచి 'నూకాంబిక' కొత్త అమావాస్య జాతర

» భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి

» సమీక్షా సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ



వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

**అనకాపల్లి టౌన్, మార్చి 26:** స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ ఏడో తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో చిన్నికృష్ణ పలు శాఖల అధికారులను కోరారు. అమ్మవారి జాతర ఏర్పాట్లపై ఆలయ ఈవో (అసిస్టెంట్ కమిషనర్) కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ అధికారులు ఆలయ పరిసరాలతో పాటు ఆలయానికి వచ్చే మార్గాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా వుంచాలని స్పష్టం చేశారు. ఆది, మంగళ, గురువారాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందుబాటులో వుంచాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారిలో అమ్మవారి ముఖద్వారం నుంచి ఆలయానికి వచ్చే మార్గం, ఆలయం నుంచి పూల్‌బాగ్ వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చూడాలన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతర జరిగే నెల రోజులపాటుఊ ఆలయం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. జాతర సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని పీటీడీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం, మత్తు పదార్థాల అమ్మకాలు జరగకుండా ఎక్సైజ్ అధికారులు గట్టి నిఘా పెట్టాలని చెప్పారు. సమావేశంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆలయ ఈవో బండారు ప్రసాద్, డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు, ఎక్సైజ్ సీఐ కుమారి, ఆర్‌ఐ రమేశ్, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారి సుమిత్ర, పీటీడీ ఏడీఎం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల 22 నుంచి అమ్మవారి మూలవిరాట్ దర్శనం



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

నూకాంబిక అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 22వ తేదీ నుంచి భక్తులకు అమ్మవారి మూలవిరాట్ దర్శనం కల్పిస్తామని, అప్పటి వరకు బాలాలయంలోనే అమ్మవారిని దర్శించుకోవాలని దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత చెప్పారు. ఆర్డీవో సమీక్ష అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ప్రారంభమవుతుందని, మే ఏడో తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. వేసవి కారణంగా క్యూ లైన్లలో నిల్చునే భక్తులు ఇబ్బందులు పడకుండా తాటాకు పందిళ్లు వేయిస్తున్నామని తెలిపారు. క్యూ లైన్లలో భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, చంటిపిల్లలకు పాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీసీ చెప్పారు.

## టీడీపీ విశాఖ అధ్యక్షుడిగా గండి బాబ్జీ



**విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ):** విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ నియమితులయ్యారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మంగళ వారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం పార్టీ అధ్యక్షునిగా ఉన్న పల్లా శ్రీని వాసరావు వచ్చే ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీ చేయబోతున్నారు. పల్లా శ్రీనివాసరావు సుమారు నాలుగేళ్ల అధ్యక్ష పదవిలో కొనసాగారు. గండి బాబ్జీ మూడేళ్లుగా విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయితే, పొత్తులో భాగంగా సౌత్ సీటు జనసేనకు దక్కింది. ఈ నేపథ్యంలో బాబ్జీకి సముచిత స్థానం కల్పించాలని భావించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షునిగా నియమించారు. ఉమ్మడి విశాఖ జిల్లా సబ్బవరం మండలం మొగలిపురం గ్రామానికి చెందిన గండి బాబ్జీ బీఎల్ పట్టభద్రులు. తొలుత కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి పలు పదవులను అలంకరించిన తరువాత 2004లో పెందుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రెండు పర్యాయాలు అదే స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016లో తెలుగుదేశం పార్టీలో చేరిన బాబ్జీకి 2020లో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో కేడర్‌ను సమన్వయం చేస్తూ ప్రభుత్వ విధానాలపై పోరాటాన్ని సాగించారు.

### కూటమి విజయానికి కృషి

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు అధినేత చంద్రబాబునాయుడుకు గండి బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళతానన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన వ్యూహాల మేరకు పనిచేసి ఫలితాలను రాబడతామని బాబ్జీ వెల్లడించారు.

## 'ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఉద్యోగిపై చర్యలు తీసుకోండి'



ఎమ్మెల్యే గణేశ్ పక్కన నిల్చొని ఉన్న అప్పలనాయుడు

**నర్సీపట్నం, మార్చి 26:** ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన సేంద్రియ వ్యవసాయం జీరో బడ్జెట్ నేషన్ ఫార్మింగ్ (జెడ్బీఎన్ఎఫ్) ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని అమలాపురం గ్రామానికి చెందిన పైల గంగాధర్ మంగళవారం నర్సీపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంకి ఫిర్యాదు చేశారు. అమలాపురం శివారు గ్రామం పాత ఉప్పర గూడేనికి చెందిన జెడ్బీఎన్ఎఫ్ ఉద్యోగి పిండి అప్పలనాయుడు ఈ నెల 24వ తేదీన రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారని, స్థానిక ఎమ్మెల్యే గణేశ్‌తో గ్రూప్ ఫొటో దిగి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

» రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌వర్మ

**పరవాడ, మార్చి 26:** పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవివ్వాలని, తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌వర్మ పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలోని ఎంఏఎస్ఆర్ఎం భవనం వద్ద మంగళవారం నిర్వహించిన జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జీవీవీఎస్ నారాయణరావు, ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ రావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు రామ్మోహనరావు, రామరాజు, సునీల్‌రాయ్ వాద్వా, గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ సమావేశంలో పాల్గొన్న వలంటీర్ విధుల నుంచి తొలగింపు



వృత్తంలో ఉన్న వలంటీర్ ప్రసాద్

**అనకాపల్లి టౌన్, మార్చి 26:** గ్రామ/ వార్డు వలంటీర్లు రాజకీయ పార్టీల సమావేశాల్లో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ స్పష్టంగా చెబుతున్నప్పటికీ స్థానిక 10వ సచివాలయం వార్డు వలంటీర్ వైసీపీ సమావేశంలో పాల్గొన్నారు. దీంతో అతనిని విధుల నుంచి తొలగిస్తూ జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. కొట్నీవీధిలో ఈ నెల 24వ తేదీ రాత్రి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సమావేశం జరిగింది. దీనికి 10వ వార్డు సచివాలయ వలంటీర్ ఎ.ప్రసాద్ హాజరయ్యాడు. దీనిపై కొంతమంది వ్యక్తులు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన అనంతరం వలంటీర్ ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించినట్టు జోనల్ మిషనర్ మంగళవారం తెలిపారు.

## ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏసుదాసు



గనిశెట్టి ఏసుదాసు

**ఎలమంచిలి, మార్చి 26:** ఏఐటీయూసీ జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గనిశెట్టి ఏసుదాసు ఎన్నికయ్యారు. ఎలమంచిలికి చెందిన ఇతను సుమారు 28 సంవత్సరాల నుంచి కార్మికుల హక్కుల సాధన, సమస్యలపై పోరాడుతున్నారు. ఇందుకు గుర్తింపుగా తనకు ఈ పదవి లభించిందని ఏసుదాసు చెప్పారు. కాగా ఏఐటీయూసీ జిల్లా కమిటీలో ఎలమంచిలికి చెందిన వీసం వెంకటరమణ, అడ్డరోడ్డుకు చెందిన భవర్‌లాల్ రాజులకు స్థానం లభించింది.

## విశాఖ విమానాశ్రయం రన్‌వే రీ సర్ఫేసింగ్ పనులు పూర్తి

» ఏప్రిల్ 1 నుంచి 24 గంటలు రాకపోకలు

**విశాఖపట్నం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):** విశాఖపట్నం విమానాశ్రయంలో రన్ వే రీ సర్ఫేసింగ్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. గత ఏడాది నవంబరు 15న వీటిని ప్రారంభించారు. మార్చి 31తో పూర్తి చేయాల్సి ఉంది. అనుకున్న ప్రకారమే నేవీ వీటిని పూర్తిచేస్తోంది. ఈ పనుల కోసం విమానాశ్రయం పని వేళలను కుదించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే పౌర విమానాలను అనుమతిస్తున్నారు. ఆ ప్రకారమే విమాన సంస్థలు వింటర్ షెడ్యూల్ ప్రకటించాయి. అయితే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త రన్ వే పూర్తిగా అందుబాటులోకి రానుంది. ఆ రోజు నుంచి 24/7 విమానాల రాకపోకలు ఉంటాయని నేవీ ప్రకటించింది.

## తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

**అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):** గ్రామాలు, పట్టణాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, మునిసిపల్, విద్యుత్ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు ఎదురైనట్టు సమాచారం అందినే వెంటనే స్పందించాలని సూచించారు. మరమ్మతులకు గురైన బోర్లను తక్షణమే బాగుచేయించాలన్నారు. భూగర్భ జలాల లభ్యతనుబట్టి తాగునీరు సరఫరాను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

## ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

**అనకాపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):** జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్ ఇన్‌చార్జి అధికారులకు పలు సూచనలు చేశారు.

## ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం

**మాకవరపాలెం, మార్చి 26:** అత్తవారింటి నుంచి ఇద్దరు పిల్లలతో సహా తన కుమార్తె అదృశ్యమైందని ఆమె తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జి.కోడూరు గ్రామానికి చెందిన బీశెట్టి వనజ(23)కి అదే గ్రామానికి చెందిన సంతోశ్ కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి లావణ్య, చందన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తలకు గొడవలు జరిగితే వనజ తండ్రి జోగి అప్పారావు సర్ది చెప్పి అత్తవారింటికి పంపాడు. మూడు నెలల క్రితం ఇద్దరు పిల్లలతో అత్తవారింటికి వెళ్లిన వనజ సోమవారం మధ్యాహ్నం అదృశ్యమైంది. బంధువుల ఇంటి వద్ద వెదికినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

## జీడితోటలు దగ్ధం

**మాడుగుల రూరల్, మార్చి 26:** మండలంలోని జాలంపల్లి పంచాయతీ రాచగొప్పూరు గ్రామంలో మంగళవారం ఐదెకరాల జీడితోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కుర్జి పెంటారావు, బోయిన గొంతురాజులకు చెందిన ఐదెకరాల జీడితోటలకు మంగళవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించి కాలిపోయాయి.

## అద్దాల మండపంలో ఉపమాక వెంకన్న

» నేత్రపర్వంగా స్వామివారి రథోత్సవం



అద్దాల మండపంలో స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

**నక్కపల్లి, మార్చి 26:** ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి కల్యాణ వేంకటేశ్వరుడి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. పుష్పమాలలతో అలంకరించిన రథంపై వేంకటేశ్వరుడిని ఆశీనులనుగావించి భక్తుల గోవిందనామస్మరణల మధ్య మాడవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. మంగళవారం వేకువజాము నుంచి రాత్రివరకు అద్దాల మండపంలో (శయన మందిరం) కల్యాణ వేంకటేశ్వరుడు విశేష దర్శనమిచ్చారు. కాగా స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి గురువారం వరకు పుష్పయాగోత్సవాలు జరుగుతాయని, 28వ తేదీతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు తెలిపారు.

## శభాష్ అన్నపూర్ణమ్మ

» 95 ఏళ్ల వయసులో అవలీలగా గరుడాద్రి పర్వతం అధిరోహణ



స్వామి నిజరూపాన్ని దర్శించుకుంటున్న వయో వృద్ధురాలు వేదుల అన్నపూర్ణమ్మ

**నక్కపల్లి, మార్చి 26:** ఎస్.రాయవరం మండలం పెనుగొల్లుకు చెందిన 95 ఏళ్ల వేదుల అన్నపూర్ణమ్మ మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చారు. గరుడాద్రి పర్వతంపై స్వామివారి నిజరూపం దర్శనం చేసుకోడానికి మెట్ల మార్గంలో (సుమారు 360 మెట్లు) వెళ్లారు. గరుడాద్రి పర్వతాన్ని పది నిమిషాల్లో అవలీలగా అధిరోహించారు. తొమ్మిదిన్నర పదుల వయసులో కూడా అన్నపూర్ణమ్మ ఓపిక, సత్తువను చూసి సహచర భక్తులు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను 40 సంవత్సరాల నుంచి ప్రతి శనివారం నీరు కూడా తీసుకోకుండా కఠిక ఉపవాసం ఉంటూ గోవిందనామ స్మరణ చేస్తున్నానని చెప్పారు.

## బాల్య వివాహాలు చేసేవారిపై కఠిన చర్యలు

» ఐసీడీఎస్ పీవో జి. ఉషారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో ఉషారాణి

**చోడవరం, మార్చి26:** గ్రామాల్లో తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించే దిశగా ప్రోత్సహించాలని, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీవో జి. ఉషారాణి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గవురవరం పీహెచ్‌సీలో బేటీబచావో బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలికల చదువుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నదని, ఆ దిశగా తల్లిదండ్రుల్లో చైతన్యం తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీ ఎస్ సిబ్బంది, గవరవరం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్చకులపై దాడి చేసిన వైసీపీ నేతను శిక్షించాలి

» గణేశ్ గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం నాయకుల డిమాండ్

**చోడవరం, మార్చి26:** ఆలయంలో భక్తుల సమక్షంలో అర్చకులపై దాడికి పాల్పడిన కాకినాడ వైసీపీ నాయకుడు సిరియాల చంద్రరావుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గణేశ్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయాల్లోని అర్చకులపై ప్రతాపం చూపించి వారిపై అమానుషంగా దాడులకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువయ్యాయని, ఇటువంటి అరాచక శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అర్చకులపై దాడికి పాల్పడిన సదరు నేతపై చర్యలు తీసుకోని పక్షంలో ఏపీ ప్రైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘం తరపున ప్రత్యక్ష పోరాటానికి తామంతా సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కందర్ప కృష్ణమూర్తి, కందర్ప రామేశం, పుట్రేవు శ్యాంప్రసాద్, వింజమూరి శంకర్, కొమ్మనమంచి నరసింహమూర్తి, ఉపాధ్యాయుల శ్రీనివాస్, కందర్ప సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్వాయిన్స్ ఆటాడుతున్న నలుగురి అరెస్టు

**రోలుగుంట, మార్చి 26:** మండలంలోని రోలుగుంటలో స్థానిక రైస్ గౌడాన్ వద్ద క్వాయిన్స్ ఆట ఆడుతున్న నలుగురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి కొండపాలేనికి చెందిన కర్రి శ్రీను, పోతు గణేశ్‌లను, రోలుగుంటకు చెందిన చిత్రాడ నాగరాజు, అంట్లపాలేనికి చెందిన రేగటి నాగరాజులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి నుంచి రూ.14,000 నగదును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

## నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

**కె.కోటపాడు, మార్చి 26:** కె.కోటపాడు సమీపంలో మంగళవారం నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన కె.కార్తీక్ మంగళవారం తెల్లవారుజామున పాడేరులో నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి వస్తుండగా కె.కోటపాడు సమీపంలో పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

## 20 లీటర్ల నాటుసారాతో ఒకరి అరెస్టు

**రావికమతం, మార్చి 26:** మండలంలోని పిల్లవానిపాలెం గ్రామంలో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశామని రావికమతం ఎస్‌ఐ ధనుంజనాయుడు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని పిల్లవానిపాలెం గ్రామంలో మంగళవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన ఎం.రాము తయారు చేసి విక్రయానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారాతో పాటు తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడు రాముని అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

# జోలాపుట్టు జలాశయంలో నీటి మట్టం తెలిపే యంత్రం

▸ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన అధికారులు


జోలాపుట్టు స్పిల్‌వే డ్యామ్ వద్ద మిషన్ ఏర్పాటు పనులు చేపడుతున్న దృశ్యం

**ముంచంగిపుట్టు, మార్చి 26 :** ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలు సంయుక్తగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు స్పిల్ వే డ్యామ్ వద్ద ప్రాజెక్టు అధికారులు మంగళవారం టెలిమెట్రీ సెన్సార్ ఆటోమేటిక్ వాటర్ లెవెల్ ట్రాన్స్‌మిషన్ (జలాశయంలో నీటి నిల్వలను తెలిపే యంత్రం)ను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఇది జలాశయంలో పీటీ స్థాయిని ప్రతి 30 నిమిషాలకు ఒకసారి ఆటోమేటిక్ సెన్సార్ పద్ధతి ద్వారా తెలియజేస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అలాగే నీటి నిల్వల వివరాలను స్థానిక జలాశయం సిబ్బందితో పాటు భువనేశ్వర్‌లో ఉన్న జలాశయ ఉన్నతాధికారులకు సైతం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. జలాశయంలో నీటి నిల్వలు ప్రమాద స్థాయిలో ఉంటే హెచ్చరికను సూచిస్తుంది. దీంతో సకాలంలో అప్రమత్తం అయ్యేందుకు వీలుంటుంది. విద్యుత్‌తో పాటు సోలార్ సిస్టమ్ ద్వారా ఈ టెలిమెట్రీ ట్రాన్స్‌యొషన్ పని చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు ఎత్తులు!

▸ గెడ్డకు వాహనాలు వెళ్లకుండా గతంలో తవ్విన గోతులు పూడ్చివేత

▸ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు రైతులు వెల్లడి



నాడు అధికారులు అలా తవ్వకం.., నేడు అక్రమార్కులు ఇలా పూడ్చివేత

**కృష్ణాదేవిపేట, మార్చి 26 :** గొలుగొండ మండలం లింగంపేటలోని బొడ్డేరు గెడ్డలో ఏర్పాటు చేసిన భారీ రక్షిత మంచినీటి పథకం ప్రాజెక్టు సంరక్షణకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టిన చర్యలకు పలువురు ఇసుక అక్రమార్కులు విఘాతం కలిగిస్తున్నారు. గెడ్డలో ఇసుక తవ్వకాలు జోరందుకోవడంతో నీటి పథకం ప్రాజెక్టుకు భవిష్యత్తులో తలెత్తనున్న నష్టాన్ని గుర్తించిన సదరు అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి తొమ్మిదో తేదీన గెడ్డకు వెళ్లే రహదారి మధ్యలో లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాలు వెళ్లకుండా పెద్దపెద్ద గోతులను జేసీబీ సాయంతో తీయించారు. దీంతో గత కొంత కాలంగా ఇసుక తవ్వకాలు తగ్గుముఖ పట్టాయి. ప్రాజెక్టు సురక్షితంగా ఉంటుందని అంతా భావిస్తున్న తరుణంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సదరు గోతులను పూడ్చివేశారు. మళ్లీ ఇసుక అక్రమ తవ్వకాల కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడి ఉంటారని పలువురు ఆరోపిస్తున్నారు.

## సైబర్ నేరగాళ్ల టోకరా

... 5వ పేజీ తరువాయి

సమాచారం వచ్చింది. దీంతో షాపు యజమాని లబోదిబోమంటూ కిరాణా సరకులు కొనుగోలు చేసిన వ్యక్తి కోసం సమీపంలోని చికెన్ సెంటర్ల వద్దకు వెళ్లి వెతికాడు. కానీ అతను కనిపించకపోవడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

... 5వ పేజీ తరువాయి

అధికారులు సమన్వయంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, డీఎల్‌డీవో శాంతిలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, డీఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

## అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి 'బూడి'

... 5వ పేజీ తరువాయి

ప్రకటించింది. ఉప ముఖ్యమంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పేరును ఖరారు చేసింది. దీంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా ముత్యాలనాయుడు పోటీ చేయడం దాదాపు ఖరారైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా ఆయన కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ పేరును ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో మాడుగుల నుంచి ఆమె ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని తెలిసింది.

## మ్యాచ్ టికెట్ల అమ్మకాలు

... 5వ పేజీ తరువాయి

అమ్మకానికి ఎన్ని టికెట్లు అందుబాటులో పెడుతున్నారనే లెక్కలను నిర్వాహకులు వెల్లడించలేదు. స్టేడియం సామర్థ్యం 25 వేలు కాగా అందులో ఎన్ని టికెట్లను ఆన్‌లైన్‌లో అమ్మబోతున్నారనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. ఈ మ్యాచ్ టికెట్లను ఇప్పటికే బ్లాక్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు రాక రేపు

ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్‌లో తలపడనున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు గురువారం నగరానికి రానుందని తెలిసింది. మంగళవారం చెన్నైలో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ ఆడిన చెన్నై సూపర్‌కింగ్స్, బుధవారం అక్కడే విశ్రాంతి తీసుకుని గురువారం మధ్యాహ్నానికి విశాఖ చేరుకుంటుంది. విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు చేరుకుంటుంది. గురువారం సాయంత్రం, శుక్రవారం నెట్ ప్రాక్టీసు చేసే అవకాశాలు ఉన్నాయి. కాగా ఢిల్లీ క్యాపిటల్స్ ఈనెల 28న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ ఆడి, మర్నాడు ఉదయం అక్కడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

## వేరుశనగ సాగు విస్తరణ ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

సాగును విస్తరింపజేసేందుకు శాస్త్రవేత్తలు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు.

### అధిక దిగుబడి

నూతన వేరుశనగ రకాలు కె-7బోల్డ్ ఎకరానికి 16 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రస్తుతం రైతులు సాగుచేస్తున్న దేశవాళి రకాలు కనీసం ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. ఈ నూతన విత్తనాలను రైతులు సాగుచేసుకోవడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.

### మార్కెట్‌లో అధిక డిమాండ్

నూతన రకాలైన కె-7 బోల్డ్ రకాలకు మార్కెట్‌లో అధిక డిమాండ్ లభిస్తుంది. గింజ పరిమాణం సాధార గింజలకంటే రెట్టింపు ఉంటుంది. ఈ గింజల్లో దాదాపు 75 శాతానికిపైగా నూనె కలిగి వుంటుంది. ఈ నూతన రకాల్లో పోషకవిలువలు కూడా సాధాన గింజలకంటే రెట్టింపు వున్నాయి. చీడపీడలు ఆశించడం లేదు. ఒక మొక్క నుంచి కనీసం అర కిలోకుపైగా దిగుబడి వస్తుంది. కాయ పరిమాణం కూడా పెద్దగా వుండడంతో ఈ గింజలకి మార్కెట్‌లో కిలో రూ.200కి పైగా ధర లభిస్తుంది.

### కదిరి లేపాక్షిపై పరిశోధన

పరిశోధన స్థానంలో వేరుశనగలో అత్యధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 'కదిరి లేపాక్షి'పై శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ప్రయోగాత్మక సాగులో ఎకరాకి 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్టు గుర్తించారు. ఈ రకం ప్రధానంగా తెగుళ్లు, చీడపీడలను తట్టుకుంటుంది. గింజల్లో 51 శాతం నూనె ఉంటుంది. ప్రయోగాత్మక సాగులో శాస్త్రవేత్తలు ఉత్తమ ఫలితాలు సాధించారు.




# భానోదయాన...

మన్యం.. ఇదో ప్రకృతి సోయగాల సమాహారం. ఇక్కడి గట్టు.. పుట్ట.. చెట్టు.. ఇలా దేనిని పరికించి చూసినా కనువిందే. ఇటువంటి అందాల భువిలో మంగళవారం సూర్యోదయం వేళ నయనానందకర దృశ్యం ఆవిష్కృతమైంది. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం అంతగా మంచు కురవనప్పటికీ వేకువజామున కొండల కింద మాత్రం కాసింత ఆ ఛాయలు అగుపిస్తున్నాయి. ఇటువంటి సమయంలో ఉదయ భానుడు లేలేత కిరణాలతో మంచు తెరలను చీల్చుకుంటూ కొండల మాటునుంచి తన తేజో రూపంతో ఉదయిస్తున్న దృశ్యాన్ని చూసినవారంతా ఉప్పొంగిపోయారు. జిల్లా కేంద్రం పాడేరులోని ఈ అపురూప ఘట్టాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో ఇలా బంధించింది. (ఆంధ్రజ్యోతి-పాడేరు)







# అమలగుడ.. కానరాని అభివృద్ధి జాడ!

▸ కనీస సౌకర్యాలు కొరవడి గిరిజనులు అవస్థలు ▸ గెడ్డపై వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి వేడుకోలు ▸ రహదారి లేక డోలీలపై రోగులకు మోత


డోలీలో మహిళ ఆస్పత్రికి తరలింపు (ఫైల్)

**డుంబ్రిగుడ, మార్చి 26 :** అదో గిరి పల్లె. అక్కడివారు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. నేటికీ ఆ గ్రామానికి రోడ్డు లేకపోయింది. ఫలితంగా అష్టకష్టాలు పడిజీవనం సాగిస్తున్నారు. పిల్లలకు పాఠశాలకు పంపాలన్నా తల్లిదండ్రులకు భయమే. ఎవరైనా తీవ్ర అనారోగ్యానికి గురైతే సుమారు కిలోమీటరు దూరం వరకు డోలీ మోతతో తీసుకు వెళ్లాల్సిన దుస్థితి. ఆ సమయంలో ఆయువు ఉన్నవారికి వైద్య సేవలు అందడం, లేనివారు ఆ కుటుంబంలో విషాదం నింపుతుండడం జరుగుతోంది. మండల కేంద్రానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ గ్రామ దుస్థితి ఇదీ.

డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పరిధిలో అమలగుడ ఉంది. అక్కడి వారికి ఆదినుంచి అన్నీ అసౌకర్యాలే. బిజుమరవలస రోడ్డు జంక్షన్ నుంచి ఆ గ్రామానికి మధ్యలో చిన్న గెడ్డ ఉంది. దీనిపై వంతెన నిర్మించకపోవడంతో అక్కడి గిరిజనులు నేటికీ రోడ్డు సౌకర్యానికి నోచుకోలేకపోయారు. గెడ్డలో నిత్యం నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అక్కడివారు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే గెడ్డ దాటి వెళ్లాల్సిన పరిస్థితి. వర్షకాలంలో గ్రామస్థుల అవస్థలు వర్ణనాతీతం. వర్షాలు కురిసేటప్పుడు గెడ్డ పొంగి ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఇతర గ్రామాల వారితో అక్కడివారికి సంబంధాలు ఉండవు. గెడ్డ దాటి వెళ్లే పరిస్థితి లేని సమయాల్లో అనారోగ్యానికి గురై పలువురు మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఎవరికైనా అనారోగ్యం సోకితే కిలో మీటరు దూరం వరకు డోలీ మోతతో తీసుకు రావాల్సి వస్తుంది. గెడ్డ దాటి బిజుమరవలస జంక్షన్‌కు చేరుకుని అక్కడి నుంచి 108 వాహనంలోనో లేక ప్రైవేటు వాహనంలోనో ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామంపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చూపుతుండడం తగదని గ్రామస్థులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో పిల్లలు చదువుకునేందుకు పాఠశాల కరువైందని అక్కడివారు చెపుతున్నారు. గత్యంతరం లేక బిజుమరవలస జంక్షన్‌లో గల పాఠశాలకు పంపుతున్నారు. పిల్లలు ఇంటి నుంచి బయల్దేరింది మొదలు తిరిగి ఇంటికి చేరుకునేవరకు తమకు ఆందోళనగా ఉంటుందని అంటున్నారు. ఓ వైపు పొలాల గట్లపై వెళుతుండడం వల్ల విషసర్పాల భయం, మరోవైపు గెడ్డ దాటే సమయంలో ఎలా ఉంటుందోనని నిత్యం టెన్షన్ పడుతున్నామన్నారు. ఇక వర్షాలు కురిసినప్పుడు పిల్లలు చదువులకు దూరంకాక తప్పడం లేదని అంటున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా పక్కా గృహాలు మంజూరవుతున్నా తాము నిర్మించుకో లేకపోతున్నామని అక్కడివారు వాపోతున్నారు. రోడ్డు లేక నిర్మాణ సామగ్రిని గ్రామానికి చేర్చడం కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. ఒకవేళ ఎవరైనా ఇల్లు కట్టాలని భావిస్తే ప్రభుత్వం ఇచ్చిన రాయితీ నిర్మాణ సామగ్రి మోతకే సరిపోతుందని అంటున్నారు. గెడ్డపై వంతెన నిర్మాంచాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో ఏ అవసరంతీరా లన్నా, రోడ్డు సౌకర్యం కలగాలన్నా వంతెన నిర్మాణం ఒక్కటే మార్గమని ఎన్నిసార్లు వేడుకుంటున్నా ఫలితం లేకపోతోందని అంటున్నారు. ఇప్పటికైనా తమ ప్రధాన సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.


అమలగుడ వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

### కమలబందలోనూ రోడ్డు కష్టాలే..!


కమలబందకు వెళ్లేందు ఉన్న మట్టిరోడ్డు

ఇదిలావుంటే రహదారి సౌకర్యంలేక మారుమూల గ్రామం కమలబంద వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొవ్వా రోడ్డు జంక్షన్ నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఈ గ్రామం ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ ఉన్నది మట్టి రోడ్డు కావడంతో వర్షకాలంలో బురదమయంగా మారుతోంది. ఆ సమయాల్లో అడుగుతీసి అడుగువేయాలంటే ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి 2019లో నిధులు మంజూరైన ఇప్పటికీ సుమారు ఐదేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని అక్కడివారంతా వాపోతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి, తమ రహదారి కష్టాలు తీర్చాల్సిందిగా అంతా కోరుతున్నారు.

## స్వచ్ఛందంగా నాటు తుపాకీలు అప్పగింత


గిరిజనులు అప్పగించిన తుపాకీలను చూపుతున్న రెండు స్టేషన్ల పోలీసు అధికారులు

**ముంచంగిపుట్టు/ పెదబయలు, మార్చి 26 :** గిరిజన గ్రామాల్లో ఎవరి వద్దనైనా నాటు తుపాకీలు ఉంటే పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛందంగా అప్పగించాలని సీఐ ఆర్.రమేష్ అన్నారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కోడాపుట్టు గ్రామానికి చెందిన ఇద్దరు తమ వద్ద ఉన్న రెండు నాటు తుపాకీలను స్వచ్ఛందగా సీఐ సమక్షంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తుపాకీలు ఉన్నవారు అప్పగించకుంటే చట్టప్రకారం కేసులు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.రవీంద్ర పాల్గొన్నారు. అలాగే, పెదబయలు మండలంలో ఇద్దరు గిరిజనులు రెండు నాటు తుపాకీలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. గలగండ పంచాయతీ మంగబంధకు చెందిన కొర్రా మదవరావు, మర్రి గోపాలరావులు తుపాకీలను అప్పగించినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

## నీలగిరి తోటకు నిప్పు పెట్టిన ఆకతాయిలు!


మంటలను అదుపు చేస్తున్న యువకులు

**ముంచంగిపుట్టు, మార్చి 26 :** ఇక్కడి రామాలయం సమీపంలోని కొండపై మంగళవారం ఆకతాయిలు నీలగిరి తోటకు నిప్పు పెట్టారు. దీంతో తోటలో మంటలు చెలరేగాయి. సమీపంలో నివాసం ఉంటున్నవారు ఆ మంటలను చూసి భయాందోళన చెందారు. ఆ దగ్గరలోనే విద్యుత్ వైర్లు ఉండం, మంటలు ఎగసి పడుతుండడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని బావించి సబ్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సదరు సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. అలాగే స్థానిక యువకులు, పోలీసులు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇది ఆకతాయిల పనిగా స్థానికులు అనుమానిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ మంటలు అదుపులోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## 'పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవు'


జీకేవీధిలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న డీడీ

**గూడెంకొత్తవీధి/చింతపల్లి, మార్చి 26 :** పదో తరగతి పరీక్షల్లో కాపియింగ్ జరిగితే చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు హెచ్చరించారు. జీకేవీధి బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉదయం పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే, మధ్యాహ్నం చింతపల్లి టీడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాలలో జరుగతున్న దూర విద్య ఇంటర్మీడియట్ పరీక్షలను పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు ఎక్కడా అవకాశం లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, పీజీహెచ్ఎంలు పల్లవి, సాగిన రామరాజు పడాల్, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో ఆదివాసీలకు తీరని అన్యాయం

▸ ఎన్నికల్లో భారత్ ఆదివాసీ పార్టీ పోటీ : రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు


పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమైన రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు

**చింతపల్లి, మార్చి 26 :** ఏడు గిరిజన శాసనసభ స్థానాలు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తెలిపారు. మంగళవారం ఇక్కడ పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల హక్కులు, చట్టాలు సమర్థవంతంగా అమలు కావాలంటే రాజ్యాధికారం కావాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీలకు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న భూబదలాయింపు 1/70 చట్టం షెడ్యూల్ ప్రాంతంలో సమర్థవంతంగా అమలు కావడం లేదన్నారు. ఈ చట్టం ఉల్లంఘనపై ఆదివాసీ జేఏసీ ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు, పాలకులు స్పందించడం లేదన్నారు. గిరిజన ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్నారని ఆరోపించారు. గిరిజన ప్రాంత ప్రజలు తమ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆరికె నీలకంఠం, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ పి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్, మహిళా నేత డాక్టర్ సీతారత్నం, నాయకులు అన్నారావు, రవి ప్రసాద్, సుభకృష్ణ దొర తదితరులు పాల్గొన్నారు.

## రంపులలో ఘనంగా గాలికొండమ్మ పండగ


అమ్మవారికి సారె, గరగలు తీసుకొస్తున్న భక్తులు

**గూడెంకొత్తవీధి, మార్చి 26 :** మండలంలోని రంపుల గ్రామంలో మంగళవారం గాలికొండమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకలో భాగంగా అమ్మవారికి గరగలు, సారెను తీసుకొచ్చి సమర్పించారు. గ్రామ పెద్దలు కంకిపాటి గిరిప్రసాద్, నరేశ్, సిరిబాల రామారావు, పూజారి బాలరాజు, పోటూరు రాజుబాబు, కవడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 'రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లేకుంటే చర్యలు'

**చింతపల్లి, మార్చి 26 :** సీసీ రోడ్ల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని పాడేరు విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ వామగెడ్డ కొత్తూరులో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఎక్కడైనా ఇటువంటి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బిల్లుల చెల్లింపు నిలిపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ కాంతారావు, పీఆర్ ఏఈఈ బాల కిశోర్ పాల్గొన్నారు.

### బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు


ముంచంగిపుట్టులో తనిఖీలు చేపడుతున్న బాంబ్‌స్క్వాడ్

**ముంచంగిపుట్టు, మార్చి 26 :** మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి పెదబయలు, జోలాపుట్టు, రూఢకోట తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో మంగళవారం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో పలు రహదారులకు ఇరువైపుల, కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనల క్రింద, రాళ్ల గుట్టల వద్ద తదితర క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే మండల కేంద్రంతో పాటు పలు ప్రధాన జంక్షన్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ కోరారు.

## 'పాడేరు'పై కూటమి పునఃపరిశీలించాలి


కొండలరావు ఆధ్వర్యంలో సమావేశమైన టీడీపీ శ్రేణులు

**జి.మాడుగుల, మార్చి 26 :** పాడేరు నియోజకవర్గం అభ్యర్థి విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పెద్దలు పునఃపరిశీలన జరపాలని టీడీపీ మండల నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు అధ్వర్యంలో మంగళవారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ పొత్తుధర్మం ప్రకారం పాడేరు టిక్కెట్టును బీజేపీ కేటాయించినప్పటికీ క్షేత్రస్థాయిలో టీడీపీ బలంగా ఉందన్నారు. ఈ తరుణంలో గిడ్డి ఈశ్వరికి టిక్కెట్ కేటాయిస్తే సునాయసంగా విజయం సాధిస్తారన్నారు. మూడు పార్టీల అధినాయకత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిట్టిబాబు, కృష్ణమూర్తినాయుడు, అప్పారావు, కొండబాబు, సన్యాసినాయుడు, పిన్నయ్య బాలయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

### గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

**పాడేరు రూరల్, మార్చి 26:** ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏఎస్ఆర్ జిల్లా గురుకుల సెల్ కో-ఆర్డినేటర్ జేఎన్ సంధ్య భార్గవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు భీమిలి, అచ్యుతాపురం(బాలికలు), నర్సీపట్నం (బాలురు)లో 5వ తరగతికి 80 సీట్లు, 6, 7, 8వ తరగతులకు బ్యాక్‌లాగ్ సీట్లతో పాటు గురుకుల కళాశాల తాటిపూడి (బాలికలు) ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ప్రవేశానికి అల్లూరి జిల్లాకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆమె తెలిపారు. ఆసక్తి గల అల్లూరి జిల్లాకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అన్ని తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన పాడేరులో ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

### రహదారి నిర్మాణ శిలాఫలకం ధ్వంసం


ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య

**చింతపల్లి, మార్చి 26 :** మండలంలోని గొందిపాకలు పంచాయతీ చిక్కుడుబట్టి రహదారి నిర్మాణం సమయంలో వేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.